# బురకమ్మ - కర్రీరెడ్డి

**రాములవారి గుడివెనకాల తాడోరి వీధిలో కాపురముంటున్న నారాయణరెడ్డి సూరమ్మ. వాళ్ళకి పిల్లలు పుడుతున్నారుగానీ, బతికి బట్ట కడ్డం లేదు. దాంతో, మామిడాడెళ్ళి సూర్నారాయణమూర్తి గుళ్ళో చేయని పూజల్లేవు. నోయని నోముల్లేవు. కట్టని ముడుపుల్లేవు.**

**ఎనిమిదిమంది పోయిన తర్వాత పుట్టిన తొమ్మిదో బిడ్డని గుళ్ళోకి తీసుకెళ్ళి ''ఈ బిడ్డనైనా బతికించు సూర్నారాయణమూర్తీ'' అని మొక్కుకుని ఆ బిడ్డకి బురకమ్మ అని ఆగుళ్ళోనే పేరు పెట్టేరు.**

మండువాలోగిట్లోమొలతాడునిండా, రెండుచేతులకీ నల్లపూసలూ, కుడికాలుకి వెండ్రుకలతాడూ కట్టుకుని తిరుగుతున్న బురకమ్మకి ముందు పుట్టిన ఎనిమిదిమందికి పెడదామనుకున్న పేర్లు పెట్టి పిలుస్తున్నారు నారాయణరెడ్డి, సూరమ్మలు. ఎవరే పేరు పెట్టి పిలిచినా ముద్దుగా పలికేది బురకమ్మ.

పెద్ద మనిషవ్వకండానే బురకమ్మని మావిడాడ పాటిమీద బలాదూర్‌గా తిరిగే కర్రీరెడ్డి కిచ్చి పెళ్ళి చేసేసేరు.

కర్రీరెడ్డికి గీర చాలా ఎక్కువ. ఎవడ్నీ లెక్క చెయ్యడు. ఎవడికీ చెయ్యి చాచడు.


బురకమ్మయితే వీర్రెడ్డికి ఎదురు. అందరిదగ్గరా చెయ్యి చాస్తానే ఉంటుంది.

ఊళ్ళో జరుగుతున్న చిన్న చిన్న గొడవలక్కూడా నేనే మగోడ్ని అంటా హడావుడి చేస్తా వుండేవాడు. ఓసారి గుంపోళ్ళ కుర్రోడు వీర్రెడ్డి తమ్ముడుగారింట్లో పందెం కోడ్ని దొంగతనం చేసేడన్న అనుమానంతో పట్టుకున్నారు. ఆ వీధిలోంచెళ్తున్న వీరెడ్డి చూరులో ఉన్న కొరడాకర్ర తీసి చావబాదేడు వాడ్ని. అది తెల్సిన గుంపోళ్ళు పగబట్టి రాత్రికి రాత్రే కర్రీరెడ్డి ఇంట్లో జొరపడి చాలా సామాన్లు పట్టుకుపోయారు.

వీరెడ్డికీ బురకమ్మకీ కవల పిల్లలు పుడితే రామలక్ష్మణులు అని పేర్లు పెట్టారాళ్ళకి.

తుఫాను పట్టి వారం రోజులు పాటు విడవకండా కొండ చిల్లులు పడ్డట్టు, కుండపోతగా వర్షాలు కురిసినియ్యి. పచ్చి బాలింతరాలు బురకమ్మ లేచే ఓపిక లేక ఆ వర్షం నీళ్ళు గుండిక లోపెట్టి పొట్టు పొయ్యి మీద పెట్టి వేడ్నీళ్ళు కాసి కుర్రోడికి తలంటుపోసింది. ఆ నీళ్ళలో ఏం విషం ఉందోగానీ పోసిన రెండోరోజే కవలపిల్లల్లో ఒకడు పోయేడు.

అక్కడ్నించి మొదలయ్యాయి కర్రీరెడ్డి బురకమ్మల మధ్య గొడవలు.



బురకమ్మ మళ్ళీ నీళ్ళోసుకుంది. బురకమ్మకి అయిదోనెలొచ్చింది.

వీరెడ్డి పెద్దాడలో కమ్మోళ్ళావిడ్ని ఉంచుకుని బండితోలితే వచ్చే డబ్బులు మొత్తం ఆ మనిషికిచ్చేసేవాడు. రెండోకూతురు శేషమ్మ పుట్టింది.

అక్కడ్నించి ప్రతీఏడూ బురకమ్మకి కడుపొస్తానే ఉంది పిల్లలు పుడతానే ఉన్నారు.

వీరెడ్డి మట్టుకి ఒకో ఊళ్ళో ఒకో ముండని ఏర్పాటు చేసుకుంటానే ఉన్నాడు. నిజం చెప్పాలంటే బురకమ్మా ఈరెడ్డీ కల్సున్న రోజులుకంటే విడిపోయిన రోజులే ఎక్కువ. ఒక్క పిల్లలు పుట్టే విషయంలో తప్ప ఇంకేవిషయంలోనూ వాళ్లిద్దరి మధ్యా కుదిరేది కాదు.

వీరెడ్డి ముండలకోసం ఊళ్లమ్మట పడి తిరుగుతుంటే, ఇల్లు గడవక నానా అవస్థలూ పడ్తున్న బురకమ్మ రాములోరి గుడి అరుగు మెట్లు కడిగి, పాచిపని చేసి కళ్ళాపు జల్లి ముగ్గులెట్టి, పువ్వులు కోసే పని ఒప్పుకుంది.

కాస్త పెద్దోడయిన పెద్ద కుర్రోడ్ని కోరోరింట్లో పాలేరు తనానికి పెట్టింది. వాళ్లింట్లో కొబ్బరికాయలు దొంగతనం చేశాడని ఈ కుర్రోడ్ని చావ బాది వీరెడ్డికి చెపితే, ఊళ్ళో పెద్దలముందు నా పరువు బజారుకీడుస్తున్నావురా నాకొడకా అంటూ మళ్ళీ చావబాదేడు. ఆ సబ్బెళ్ళోరి గరువుమీద జలగడ్డి దొంగతనంగా కోసి ఎద్దులకి వేశాడు పెద్దకొడుకు. అది చూసిన సబ్బెళ్ళోరు కుర్రోడ్ని ఏమి అనకండా వీరెడ్డికి చెపితే నులకమంచం మీద పడుకున్న ఆ కుర్రోడ్ని గొడ్డుని బాదినట్టు బాదేసేడు. అడ్డొచ్చిన బురకమ్మని నీ పెంపకం వల్లే ఈడు ఇలా తయారయ్యాడు అంటూ చితగ్గొట్టేసి ముండ ఇంటికెళ్ళిపోయేడు. ఆవేళ నించి ఈ కుర్రోడు కనపడితే చాలు కొట్టకండా వదిలేవాడు కాదు. ఊళ్ళో ఏ చిన్న దొంగతనం జరిగినా ఈడే చేసుంటాడంటా కొట్టేవాడు.

కొడుకు మీద ప్రేమ చంపుకోలేక వీరెడ్డి కొడుతున్న దెబ్బలు చూళ్ళేక వాడ్ని మిద్దెమీద దాచేసి, కర్రీరెడ్డి గురకెట్టి నిద్రోతున్నటైంలో బొడ్డిగిన్నెలో అన్నం మట్టిపిడతలో మజ్జిగపోసి పెట్టేది.

ఒకరోజు అది వీరెడ్డి కళ్ళపడేసరికి అన్నం తింటున్న కుర్రోడ్ని చచ్చిపోతాడని చూడకండా చావగొట్టాడు. దెబ్బలకు తట్టుకోలేక ఊరు వదిలి పారిపోయాడా కుర్రోడు.

పెద్దపిల్ల శేషమ్మకి తొమ్మిదో యేటనే కోరిశేషగారి రెండోవాడ్నిచ్చి పెళ్ళి చేసేసేక, పసిపిల్లలు సత్యనారాయణా, సీతా, దొర, పాపల్ని పెట్టుకుని గుళ్ళో చాకిరీ చేస్తూ సంసారాన్ని ఈదుకొస్తూంది. ఎదుగుతున్న సత్యనారాయణా, సీత గంపలు నెత్తిమీదెట్టుకుని రోడ్డు మీదెళుతున్న పశువులు పేడ వేస్తే ఎత్తుకొచ్చి పిడకలు చేసి గుడి వె నకాల గోడమీద జల్లేవారు.


అప్పుడప్పుడూ ఊళ్ళో వడ్లు దంచడానికి, కారం కొట్టడానికి పెళ్ళిళ్ళకి వంటలు చెయ్యడానికి వెళ్ళొస్తున్న బురకమ్మ అలసిపోయి ఇంటికొచ్చి వంట చెయ్యలేక ఈ పిల్లల్ని చావ బాదేసేది.

* * *

ఆ మధ్యాన్నం సైకిలుషాపు పాపారావుగారింటి ముందు నిలబడ్డ ఆంబోతుకి పాపారావుగారి రెండోవాడు చేటలో కొత్తఒడ్లు పెడితే తినేసెళ్ళిపోయింది. మైకుసెట్టుగోపాళం గారింటి ముందు ఇసక గుట్ట మీద కూర్చున్న ఇద్దరు చిన్నపిల్లలు తలంబ్రాలు పోసుకున్నట్టు ఇసకని నెత్తి మీద పోసుకుంటుంటే అందులో ఓ పిల్లతల్లొచ్చి బాదుకుంటా తీసుకుపోయింది. బుచ్చిరాజు కిళ్ళీకొట్టు ముందు వేలాడగట్టిన అరిటిపళ్ళగెలకి కత్తి దిగబడివుంది. పెద్దవీధిలో అరుస్తా సైకిలు తొక్కుకుంటా వెళ్తున్న బట్టల మూటోడు బాగాలావుగా ఎత్తుగా ఉన్నాడు.

వాడి గొంతుమట్టుకు ఆడదానిదిలాగుంది.

రోజూలాగే అలిసిపోయి పనిచేసి చేసి అలిసిపోయి ఇంటికొచ్చిన బురకమ్మ అన్నం వండుదావంటే డబ్బాల్లో ఏవీలేవు. బానలో బియ్యం నిండుకున్నాయి. పిల్లలు చూస్తే ఒక పక్కనించి ఏడ్చేస్తున్నారు.



వాళ్ళ ఏడుపులు జూస్తుంటే జాలితో పాటు చాలాకోపమొచ్చేస్తుంది.చిరాకొచ్చేస్తుంది. ఏడుపొచ్చేస్తుంది. కొడదావంటే బక్కచిక్కిన ఆ పిల్లలు ఎక్కడ ప్రేణాలొదిలేస్తారో అని బెంగ.

ఈలోగా ఎవరో వస్తున్నారనిపించి వీధి గుమ్మం వేపు చూసింది.

వెనకటికి పారిపోయిన పెద్ద కుర్రోడు చేతిలో ఒక నారసంచితోనూ రకరకాల పొట్లాలతోనూ నిలబడి ఉన్నాడు. వాడికాళ్ళు వణుకుతున్నాయి. కళ్ళలో నీళ్ళున్నాయి. అడుగులో అడుగేస్తా బురకమ్మ దగ్గరకొచ్చి ''అమ్మా'' అన్నాడు.

వాడ్ని గుండెల్లో పెట్టుకున్న బురకమ్మ ''ఇన్నాళ్ళూ ఎక్కడికెళ్ళిపోయేవురా బాబా?'' అంది.

''కాకినాడ పారిపోయి దేవాలయం వీధిలో ఉన్న బాబ్జీగారి హోల్‌సేల్‌కిరాణా కొట్లో చేరాను. అంతేగాకుండా మన రెడ్ల కుర్రోళ్ళతో చిన్న వడ్డీవ్యాపారం కూడా మొదలెట్టేను'' అంటా కొంత డబ్బు తల్లికిచ్చి, కరకజ్జం, మైసూరుపాకం పొట్లం, కారబ్బొంది పొట్లం పసిపిల్లలకిస్తుంటే ''అన్నయ్యతెచ్చేడు అన్నయ్య తెచ్చేడు'' అంటా ఎగబడిపోతా ఆ పొట్లాల్ని పీక్కు తింటున్నారు పసిపిల్లలు. పెద్దోడు తెచ్చిన డబ్బులు తీసుకుని వంట సామాన్లు కొనడం కోసం బయటికెళ్ళింది.

సరిగ్గా అదేటయానికొచ్చిన కర్రిరెడ్డి పెద్దోడ్ని చూసి మళ్ళీ ఎందుకొచ్చేవంటా చెర్నాకోలా తీసుకుని చావగొట్టడం మొదలెట్టేడు.

తండ్రికొట్టే ఆ దెబ్బల బాధ తట్టుకోలేక బయటికి పరుగెట్టిన పెద్దోడు వెక్కి వెక్కి ఏడుస్తానే వూరి పొలిమేర దాటి వెళ్ళిపోయేడు.

* * *

కొన్నాళ్ళ తర్వాత కరపనించి దిగిన ఒకతను బురకమ్మ దగ్గరకొచ్చి "మీ పెద్దోడు కాకినాడ గవర్నమెంటు హాస్పిటల్లో చనిపోయా"డన్న కబురట్టుకొచ్చేడు.

నాకొడుక్కి ఏవైందంటూ గొల్లుమన్న బురకమ్మతో "మీ అబ్బాయికీ అప్పారెడ్డి గారబ్బాయికీ వ్యాపారంలో చిన్న చిన్న తేడాలు రావడంతో విడిపోతానన్నాడట. దాంతో ఈడు విడిపోతే మన యాపారం కుంటిపడిపోతుందని టీ లో విషం కల్పి చంపేశారంట" అన్నాడు.

పొలం నుంచి వచ్చిన వీర్రెడ్డి ఏడుస్తున్న బురకమ్మని చూసి "ఆడుపోయినందుకు ఆనందపడాలిగానీ, ఏడుస్తావేంటే ఎర్రిమొకమా" అన్నాడు.

అన్నయ్య పోయాడని పరామర్శించడానికొచ్చిన శేషమ్మ, అల్లుడు సుబ్బారెడ్డి, చిరిగిపోయిన బట్టలూ, తినడానికి తిండిలేని పిల్లల్నీ చూసి మా ఇంటికి తీసుకుపోతామని తీసుకుపోయారు వాళ్ళని.

చాన్నాళ్ళ దాకా శేషమ్మ దగ్గర పెరిగిన వీళ్ళిద్దరికీ శేషమ్మ పెళ్లికుదిరిస్తే కన్నపాపానికి మూడేసొందలు కట్నం ఇచ్చాడు వీర్రెడ్డి. పెద్ద పండుక్కి అత్తారింటికెళ్ళిన సీత మొగుడ్తో వంద రూపాయిలిచ్చి "బట్టలు కొనుక్కోండి...ఇంకెప్పుడూ మా ఇళ్ళకు రాకండి"అని చెప్పాడు వీర్రెడ్డి.

చిన్న పిల్లలు దొర్రా, పాపలు పెద్దోళ్ళు అయ్యేరు. వాళ్ళకి సరిపోయే సంబంధాలు చూసి పెళ్ళిళ్ళు చేసేసింది బురకమ్మ.

* * *

రోజులు గడుస్తున్నాయి.

కర్రీరెడ్డికి అరవైఅయిదేళ్ళు దాటాయి.

సంపాయించిన ఆస్తి, కట్నంగా యిచ్చిన పొలం తాగుడుకి, ముండలకి అయిపోయింది. దాంతో ఏదిక్కూలేక బురకమ్మ దగ్గరకొచ్చి జారపడ్డాడు. అది అలుసుగా తీసుకుని "వయసు ఉన్నప్పుడు నేనూ నా పిల్లలూ గుర్తుకు రాలేదు. ఇప్పుడు గుర్తుకొచ్చానా బయటికి పో" అంది బురకమ్మ.

అప్పట్నించి ఒక్కో కూతురూ, కొడుకూ ఇంటికి సైకిలేసుకుని వెళ్ళడం మొదలెట్టిన వీరెడ్డిని కొన్నాళ్ళు బానే చూశారు. ఆ తర్వాత బయటికి పొమ్మన్నారు.

దాంతో,

ఏ దిక్కూ లేక పెద్దాడలో ఉన్న ముండ ఎరకమ్మ ఇంటికి జేరిపోయాడు. అదికూడా విసుక్కోడం మొదలెట్టి గెంటేసింది కొన్నాళ్ళకి. అప్పుడు యానాంలో ఉన్న పెద్దకూతురు శేషమ్మ దగ్గరకెళ్ళి "మీ అమ్మా నేనూ కల్సి ఉంటాం నువ్వే కలపాలమ్మా" అనేసరికి సరే అని బురకమ్మని ఒప్పించి ఇద్దర్నీ ఒకటిచేసి రంగాపురాన్ని కొబ్బరితోటలో కాపలాకి కుదిర్చి అక్కడ దూళ్ళసావిట్లో మకాం ఏర్పాటు చేయించింది.

వారంరోజులు కాకండానే గొడవలు పడిపోయిన ఇద్దరూ శేషమ్మకి కబురెట్టారు.

"మీ నాన్న అన్నం గుండిగలో అన్నం తినేసి నేను తినే టయానికి నువ్వు అంత అన్నం తింటున్నావా, అంత కూర తింటున్నావా అంటూ బియ్యం పెట్టికి తాళం వేసి తాళం మొలతాడుకి కట్టుకుంటన్నాడు"అంది బురకమ్మ.

"మీ అమ్మ బురకమ్మ..కొబ్బరికాయలు దొంగతనంగా అమ్ముతుంది. తోటలో పుల్లలూ, కొబ్బరిమట్టలూ, డొల్లలూ లేబరోళ్ళకి అమ్మి

నా పరువు తీస్తుందని'' చెప్పాడు వీర్రెడ్డి. వాళ్లిద్దరినీ ఒప్పించి సర్ది చెప్పి వెళ్ళింది శేషమ్మ.

కానీ, శేషమ్మ వెళ్ళిన మర్నాడే మళ్ళీ విడిపోయారు.

ఒంట్లో సత్తువలేక, కళ్ళు కనపడక సైకిలు తొక్కే ఓపిక లేక ఊళ్ళమ్మట పడి కూతుళ్ళు, కొడుకులూ ఇళ్ళకి తిరగలేక, గొల్లలమామిడాడలో తమ్ముడిదూళ్ళసావిట్లో ఉంటూ తన గెంజి తనే కాచుకుంటున్నాడు కర్రీరెడ్డి.

మళ్ళీ రాములోరిగుడిమెట్లు కడిగే పనిలో చేరిన లావుపాటి బురకమ్మకి వయసయి పోవడం వల్ల పూర్వంలా శుభ్రంగా పని చేయలేక పోతుంటే పన్లోంచి తీసేశారు. పెళ్ళిళ్లకి పేరంటాలకీ వంటలు చేస్తున్న బురకమ్మ వంటలు ఈ తరానికి నచ్చక పిలవడం మానేశారు.

ఆషాఢమాసంలో కురుస్తున్న వర్షాలకి కర్రీరెడ్డి చనిపోయేడు.

ఏకపోతగా మూడురోజులు కురిసింది వర్షం.

ఆవర్షంలో తడుచుకుంటూ కొడుకులూ, కూతుళ్ళూ, అల్లుళ్ళూ, మనవలూ, మనవరాళ్ళూ, వెళ్ళి చూసేరు. చుట్టు పక్క లోళ్ళంతా ''మీ నాన్నపోయాడు కదా! మీ అమ్మని ముఖం చూడ్డానికైనా రమ్మనండి'' అన్నారు. శేషమ్మా, సీతా కల్సి వెళ్ళి ''బతికున్నప్పుడు ఎలాగూ ముఖం చూళ్ళేదు... ఇప్పుడైనా చూద్దుగాని రావే అమ్మా'' అన్నారు.

''బతికున్నప్పుడే ఆడు నన్ను పట్టించుకోలేదు...పోయేకా నాకేంటి నేను రాను'' అని కరాకండీగా చెప్పింది.

ఎంతమంది ఎన్ని విధాలుగా చెప్పినా విన్లేదు.

చేసేది లేక ఆ వర్షంలోనే స్మశానంలో నాలుగురాటలు పాతి పైన బరకం గుడ్డలు అడ్డుపెట్టి కర్రీరెడ్డి శవాన్ని పండించారు వాళ్ళ వంశీకులు.

వీర్రెడ్డి పిల్లదినం జరిగిన రోజుకూడా రాలేదు బురకమ్మ.

పదకొండో రోజున కొడుకు స్మశానంలో కర్రీరెడ్డి పెద్దదినం చేయిస్తున్నాడు. అదే టైముకి మండువాలోగిట్లో కూర్చున్న బురకమ్మ తాళిబొట్టు తెంపేసుకుంది. మట్టిగాజులు బద్దలుగొట్టుకుంది. కట్టుకున్న పచ్చచీరవిప్పి తెల్లచీర కట్టుకుంది. ఆ విధంగా ముండమోసిన బురకమ్మ ఆ సావిట్లో మూల బాగా చీకటిగా ఉంటే వెలుగులోంచి ఆ కటికనేల మీద పడుకుని ''బగమంతుడా ఎందుకు పుట్టించేవు నన్ను... ఎందుకు కట్టబెట్టేవు అలాంటి పెనిమిటిని'' అంటా ఏడుస్తుంది... ఎక్కిళ్ళొచ్చేలాగ ఏడుస్తానే ఉంది.

అది చూసిన వూరిజనం పాపం కొన్ని జాతకాలంతేనేమో ! అనుకున్నారు.

* * *